# బిల్లుపాడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ స్థాపనకు సన్నాహాలు

## విగ్రహ దాత కేతినేని వీరరామారావుకు గ్రామ ప్రజల కృతజ్ఞతలు




**తల్లాడ/ ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని బిల్లుపాడు గ్రామం జేకే నగర్ సెంటర్‌లో తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ విగ్రహానికి దాతగా నిలిచిన ఎన్టీఆర్ వీరాభిమాని కేతినేని వీరరామారావును గ్రామ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా కేతినేని వీరరామారావు మాట్లాడుతూ, మండల కమిటీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

బిల్లుపాడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ స్థాపన గ్రామానికి గౌరవకరమైన సందర్భంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విగ్రహ దాత కేతినేని వీరరామారావు కుటుంబానికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్తులు సమిష్టిగా సహకరిస్తామని తెలిపారు.

# శాస్త్రీయ దృక్పథమే సమాజ ప్రగతికి బాట

## సైన్స్ క్విజ్‌లతో విద్యార్థుల్లో జిజ్ఞాస పెంపు

## విశ్వశాంతి విద్యాలయంలో సైన్స్ వారోత్సవాలు



**సత్తుపల్లి,/ ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని సత్తుపల్లి మోటార్ వాహనాల పరిశీలకుడు రాజశేఖర్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28) పురస్కరించుకుని స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి సైన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల భాగంగా మంగళవారం సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ సైన్స్ క్విజ్‌ల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానం పెరుగుతుందని అన్నారు. శాస్త్ర విషయాలపై అవగాహన, ఆసక్తి, కుతూహలం పెంపొందడంతో పాటు కొత్త విషయాలు తెలుసుకోవాలనే తపన కలుగుతుందని చెప్పారు. పోటీ భావన పెరిగి, చదువు సరదాగా సాగేందుకు ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. విశ్వశాంతి విద్యాలయ ప్రధానోపాధ్యాయులు పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, సైన్స్ క్విజ్‌లలో పాల్గొనడం వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. వేగంగా ఆలోచించే సామర్థ్యం, ప్రశ్నలకు తక్షణ స్పందన ఇవ్వగల నైపుణ్యం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మెదడు చురుకుదనం పెరగడంతో పాటు ప్రముఖ శాస్త్రవేత్తల జీవితం, వారి ఆవిష్కరణలపై అవగాహన కలుగుతుందని చెప్పారు. సైన్స్ క్విజ్‌ల ద్వారా చదువు ఆసక్తికరంగా మారి, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలనే స్ఫూర్తి విద్యార్థుల్లో నెలకొంటుందని అన్నారు. ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు శారద, అనిల్, నరేంద్రలను పాఠశాల యాజమాన్యం నాగేశ్వరరావు, సత్యనారాయణ అభినందించారు

# ఈనెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

## పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లతో సమీక్ష సమావేశం



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఎకెవిఆర్ కళాశాలలో ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణపై మంగళవారం ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రంలో క్రమశిక్షణ, పారదర్శకత, సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ పి. శ్రీదేవి, డివో కవిత, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ బి. శ్రీకాంత్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, హాల్ టికెట్లు, సీటింగ్ అమరిక, ప్రశ్నపత్రాల పంపిణీ తదితర అంశాలలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

# 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం - బస్ టిక్కెట్ పొందే సౌకర్యం

## ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,**ఫిబ్రవరి24(జర్నలిస్ట్ వార్త);** టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్' యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ , తెలంగాణ ఆర్టీసీ వీసీ / ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ క్షఖా సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం కలుగనుంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి మరియు పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది. అందుబాటులో గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో కార్యకలాపాల కోసం టి 24 టికెట్‌ను మొబైల్ యాప్‌లో విలీనం చెయ్యడం జరిగింది. టి 24 టికెట్ అనేది 24 గంటల డిజిటల్ ట్రావెల్ పాస్, ఇది యాక్టివేషన్ సమయం నుండి సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులలో అపరిమిత ప్రయాణాన్ని అనుమతిస్తుంది.

# దుర్గమ్మ తల్లి కృపతో ప్రజలందరూ శుభిక్షంగా ఉండాలి

## : పరుపాటి శ్రీనివాస్ రెడ్డి





**రాయపర్తి,/ ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ వార్త):** దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ శుభిక్షంగా, సుఖశాంతులతో జీవించాలని ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని జేతురాం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యానగర్ తండాలో నిర్వహించిన దుర్గమ్మ తల్లి పండుగ వేడుకలకు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక భావన మనసుకు ప్రశాంతతను అందించడంతో పాటు సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ పండుగలను ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, లేతాకుల రంగా రెడ్డి, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, ఎండీ యూసఫ్, కోలా సంపత్, ల్యాదేళ్ల ప్రశాంత్, నేతావత్ శ్రీధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మం నగర శివారులో ఉద్రిక్తత

## వినోబా నగర్ భూదాన్ భూముల్లో భారీ ఆపరేషన్ వేలాది పోలీసుల మోహరింపు



**ఖమ్మం/ ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం నగర శివారులోని వెలగుమట్ల వినోబా నగర్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భూదాన్ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను తొలగించేందుకు అధికారులు భారీ స్థాయిలో చర్యలు చేపట్టడంతో ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది పోలీసులను మోహరింపజేసి తెల్లవారుజామునే ఆపరేషన్ ప్రారంభించారు. ఇళ్ల కూల్చివేతలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన నిర్వాసితులను పోలీసులు చెదరగొట్టారు. కవరేజ్ కోసం సంఘటన స్థలానికి చేరుకున్న మీడియా ప్రతినిధులను కూడా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. "పైనుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి, మీడియాకు అనుమతి లేదు" అని పోలీస్ అధికారులు తెలిపినట్టు సమాచారం.

అప్పులు చేసి, కష్టపడి ఇళ్లు నిర్మించుకున్నామని, అర్ధంతరంగా వెళ్లిపోవాలని చెప్పడం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయ వసతి కల్పించకుండా ఇళ్లను కూల్చివేయడం దారుణమని వారు కన్నీటి పర్యంతమయ్యారుఇదిలా ఉండగా, నిర్వాసిత కాలనీకి చెందిన కొంతమంది యువకులు కర్రలతో పోలీసులను ప్రతిఘటించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ప్రాంతంలో మరింత ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితి పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ, బాధితుల ఆవేదనతో ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆపదలో ఆదుకుంటూ.. ప్రాణాలు కాపాడుతున్న వీరులు

## 108 సిబ్బందికి స్టార్ అవార్డులు ప్రదానం



**హనుమకొండ/ఫిబ్రవరి 24 (జర్నలిస్ట్ వార్త):** అనుకోని ప్రమాదండ అకస్మాత్తుగా కలిగే అనారోగ్యండ రోడ్డు ప్రమాదాలుడ ప్రసూతి అత్యవసరాలుడ ఇలాంటి ప్రతి ఆపదలో ప్రజలకు ముందుగా గుర్తుకొచ్చేది 108 అంబులెన్స్ సేవలే. ఒక కాల్ అందిన క్షణాల్లోనే స్పందించి, కేవలం 30 సెకండ్లలో బయలుదేరి, 10 నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి చేరుకుని మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందిస్తూ అనేక ప్రాణాలను రక్షిస్తున్న 108 సిబ్బందిని సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

ప్రజాసేవలో ప్రతిభ కనబరిచిన ధర్మసాగర్, అయినవోలు, పరకాల మండలాలకు చెందిన సిబ్బందికి 'స్టార్ అవార్డులు' ప్రదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో చాకచక్యంగా వ్యవహరించి పలు క్లిష్ట కేసులను విజయవంతంగా నిర్వహించినందుకు అయినవోలు మండలానికి చెందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఎనుగుల రాజును అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. రోగికి ప్రాథమిక చికిత్స అందించడంలో ఆయన చూపిన నైపుణ్యం పలువురి ప్రాణాలను నిలబెట్టిందని కొనియాడారు. అలాగే అంబులెన్స్ పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వేగవంతమైన డ్రైవింగ్ నైపుణ్యంతో కేవలం పది నిమిషాల వ్యవధిలో రోగులను ఆసుపత్రికి చేర్చిన ఘనత సాధించారు. సమయపాలనతో పాటు ఇంధన వినియోగంలోనూ అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ప్రత్యేక కిలోమీటర్ల పనితీరు పురస్కారం అందజేశారు. పరకాల టీంకు చెందిన పాముల రాజు, పుట్ట విజయభాస్కర్‌లు తమ సేవలతో గుర్తింపు పొందగా, ధర్మసాగర్ మండలానికి చెందిన మాచర్ల వెంకటేష్ కూడా ఉత్తమ సేవలకుగాను అవార్డు అందుకున్నారు. వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అత్యవసర సమయంలో సమయానికి చేరుకోవడం ద్వారా ప్రతి నిమిషం ప్రాణాలను కాపాడే బాధ్యత 108 సిబ్బందిపై ఉంటుందని, వారు అహర్నిశలు సేవలందిస్తూ ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నారని అన్నారు. 108 సేవలు ప్రభుత్వ వైద్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 108 సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు. సేవాభావంతో ముందుకు సాగుతూ మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులు సూచించారు.

# పాడి రైతుల కోసం ఉచిత పశువైద్య శిబిరం

## లింగ నిర్ధారణ వీర్యంతో ఆడ దూడల పెంపకానికి అవకాశం





**జర్నలిస్ట్ వార్త/ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం రామోజీ కుమ్మరిగూడెం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం' ఘనంగా జరిగింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ భూక్య శంకర్ నాయక్, ఉప సర్పంచ్ భూక్య తిరుపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి జి. సంపత్ రావు మాట్లాడుతూ, పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న లింగ నిర్ధారణ వీర్యం ద్వారా కేవలం ఆడ దూడలు మాత్రమే పుట్టే అవకాశం ఉంటుందని, దీనివల్ల పాడి రైతులు అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. గోపాలమిత్ర సేవల ద్వారా ఈ సదుపాయాన్ని ప్రతి రైతు పొందాలని ఆయన కోరారు. ధమ్మన్నపేట పశువైద్య అధికారి డా. మలోత్ రాజేందర్ నాయక్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరానికి 66 పాడి పశువులు తరలివచ్చాయి. వైద్య బృందం వీటిని పరీక్షించి సకాలంలో చికిత్సలు అందించింది. 22 పశువులకు పరీక్షలు.

నట్టల నివారణ, 24 దూడలకు మందుల పంపిణీ.

కృత్రిమ గర్భధారణ: 6 గేదెలకు.

గర్భకోశ వ్యాధులు11 పశువులకు ప్రత్యేక చికిత్స.

చేయడం జరిగిందన్నారు. పాడి రైతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, పశుసంపదను వృద్ధి చేసుకోవాలని అధికారులు కోరారు.

ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గద్దల ఐలయ్య, విజేందర్, గోపాలమిత్ర సూపర్వైజర్ ఏంపటి రాజేశ్వర్ రావు, గోపాలమిత్రులు మల్లెపాక సంపత్, మైదం రజిత, సుదగోని గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# యువతలో చైతన్యం కోసం 'అరైవ్ అలైవ్'

## కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి24 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచారం రెండవ దశలో భాగంగా డే2 థీమ్ అయిన "హెల్మెట్ ధరించడం" పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

**హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుంది**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం ప్రతి రైడర్ బాధ్యత అని తెలిపారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ తలకు తీవ్ర గాయాల నుంచి రక్షించి, మరణ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని వివరించారు.

**ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లు తప్పనిసరి**

గరిష్ట భద్రత కోసం రైడర్లు మాత్రమే కాకుండా అందరు రైడర్లు కూడా తప్పనిసరిగా ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లు ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా కుటుంబాలను సురక్షితంగా కాపాడుకోవచ్చని తెలిపారు.

# నాగర్ కర్నూల్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రజక సంఘం నాయకులు





**వరంగల్/ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
నాగర్ కర్నూల్లో రజక కుటుంబంపై జరిగిన దారుణ దాడి ఘటన నేపథ్యంలో, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా రజక సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులకు ధైర్యం చెప్పి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సంబంధిత అధికారులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన అమ్మాయి మౌనిక సమాధిని సందర్శించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూలులో నిర్వహించిన ర్యాలీలో వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బిక్షపతి, మద్రి కుక్కల చైతన్య, పంతంగి సమ్మయ్య, దొడ్డిపాటి శేఖర్, బండి సదానందం తదితరులు ఉన్నారు.

# స్నేహానికి మారుపేరుగా నిలిచిన క్లాస్‌మేట్స్

## మరణించిన మిత్రుడి కుటుంబానికి అండగా..





**వర్ధన్నపేట/ఫిబ్రవరి24(జర్నలిస్ట్ వార్త):**
స్నేహం అంటే కేవలం సరదాలు మాత్రమే కాదు, కష్టాల్లో తోడుండటమే నిజమైన స్నేహం అని నిరూపించారు వర్ధన్నపేట మండలం ఇల్లంద ప్రభుత్వ పాఠశాల 2002-03 బ్యాచ్ విద్యార్థులు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన తమ ప్రియతమ మిత్రుడు రవికుమార్ ఈ నెల 17న అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి, ఆయన కుటుంబ సభ్యులు పడుతున్న వేదనకు స్పందించిన సహచర విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. రవికుమార్ మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆయన కుటుంబ పరిస్థితిని గమనించిన స్నేహితులు, అందరూ కలిసి ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యం, వంట నూనె వంటి నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే రవికుమార్ జ్ఞాపకార్థం ఆయన ఫోటోను కుటుంబ సభ్యులకు అందజేసి తమ సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ అందరితో కలిసిమెలిసి ఉండేవారని, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే రవికుమార్ ఇక లేరనే విషయం తమను తీవ్రంగా కలిచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భౌతికంగా రవికుమార్ దూరమైనా, ఆయనతో పంచుకున్న జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రవికుమార్ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని, ఏ కష్టం వచ్చినా వెనుకడుగు వేయమని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిటుకుల నరేష్, జోగుల కుమారస్వామి, మంద సంపత్, నరుకుడు రాజు సహా బ్యాచ్‌కు చెందిన పలువురు మిత్రులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను చెల్లించండి.గ్రామ అభివృద్ధికి సహకరించండి.

## -సర్పంచ్ గుగులోత్ శాంతి.



**బయ్యారం/ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచేందుకు కొత్త పాలకవర్గం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా సర్పంచ్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది గ్రామంలో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి బకాయిలు వసూలు చేస్తున్నారన్నట్లు వారు తెలిపారు. పెండింగ్ బకాయిదారుల వివరాల జాబితాను కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని రూపొందించేందుకు తగిన పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ తెలిపారు. మార్చి నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బిల్ కలెక్టర్స్ కుమార్, చంద్రమౌళి, అదిశేషులు తెలిపారు. ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ గుగులోత్ శాంతి ప్రజలను కోరారు. ఇప్పటివరకు 60 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యాయని, మార్చి చివరి నాటికి వందశాతం వసూలు లక్ష్యసాధన దిశగా తమ సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నామని పంచాయతీ సెక్రటరీ శ్రీధర్ తెలిపారు.

# అత్యవసర సరుకులతో దాతృత్వం చాటిన సిరివేరు కుటుంబం



**మధిర/ఫిబ్రవరి 24( జర్నలిస్ట్ వార్త):**
మధిర పట్టణానికి చెందిన సిరివేరు అంకమరావు గారి కుటుంబం మానవతా దృక్పథాన్ని మరోసారి చాటుకుంది. అంకమరావు గారి కుమారుడు, విదేశంలో ఉద్యోగం చేస్తున్న సిరివేరు దినేష్ మరియు వారి కుటుంబ సభ్యులు మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో నిత్యవసర సరుకులతో పాటు రూ.9,500 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సహాయాన్ని దినేష్ స్నేహితుడు రాజేష్ వాల్మీకి ద్వారా కేంద్ర నిర్వాహకులకు అందించారు. దాతృత్వంతో ముందుకొచ్చిన సిరివేరు కుటుంబానికి కేంద్రంలోని మానసిక దివ్యాంగ పిల్లల తరఫున నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సిరివేరు అంకమరావు, దినేష్ మరియు వారి కుటుంబ సభ్యులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవిస్తూ, తమ ఉద్యోగ రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కేంద్ర సభ్యులు దేవుని ప్రార్థించారు. సమాజంలో సేవా భావం పెంపొందించేందుకు ఇటువంటి దాతృత్వ కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు

# వెంకట్రాంపురంలో కామ్రేడ్ యాస వెంకటనారాయణ సంతాపసభ



**బయ్యారం/ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):**
సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు కురవి,డోర్నకల్ పార్టీ సబ్ డివిజనల్ కమిటీ కార్యదర్శి సీనియర్ నాయకులు కామ్రేడ్ యాస వెంకటనారాయణ సంతాప సభ మంగళవారం వెంకట్రాంపురంలో కామ్రేడ్ దొరన్న స్మారక భవన్ లో పార్టీ మండల కమిటీ సభ్యులు రామచంద్రుల మురళి అధ్యక్షతన నిర్వహించారు. కామ్రేడ్ వెంకటనారాయణకు విప్లవ జోహార్ అర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ వెంకటనారాయణ 1978లో సిపిఐ ఎంఎల్ విప్లవ పార్టీలో ప్రవేశించి,డోర్నకల్ మండలం బంజర గ్రామంలో రైతుగా జీవిస్తూ నాటినుండి తుది శ్వాసవరకు తన 85సంవత్సరాల వయసులో కూడా సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ రాజకీయాలను ముందుకు తీసుకుపోయారు. నిజాయితీగా నిస్వార్థంగా తమ సొంత ఖర్చులతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజాయుద్ధ పందా మార్గంలో ప్రతిఘటన పోరాటాల్లో క్రియాశీలక పాత్రని పోషించాడని అన్నారు. కామ్రేడ్ యాసవెంకటనారాయణ ఏ లక్ష్యసాధన కోసం తన జీవితాంతం పోరాడారో ఆ లక్ష్యసాధన కోసం పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వారం అవుతామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ మండల అధ్యక్షురాలు బొల్లం సోమక్క,వల్లాల బిక్షం,ఇస్లావత్ భీమ్లా,బచ్చలి రత్న, రావుల వెంకటమ్మ,బంక సంతోష్,ఆలేటి రాము,సువార్త నరసమ్మ,లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కొరకే గ్రామ సభ.

## -సర్పంచ్ గుగులోత్ శాంతి.




**బయ్యారం/ఫిబ్రవరి 24(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ అధ్యక్షతన గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల నుండి బయ్యారం పెద్ద చెరువు సాగునీరు సంబంధించిన కాలువల మరమ్మతులు చేపట్టాలని, ఈ వేసవికాలంలో పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్యలు లేకుండా మిషన్ భగీరథ నుండి సురక్షితమైన మంచినీటి సరఫరా చెయ్యాలని గ్రామస్తులు గ్రామసభలో ప్రస్తావించారు. విద్యుత్ సంబంధించిన పలు సమస్యలను పంచాయతీ సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. దీనికి విద్యుత్ శాఖ సిబ్బంది సురేష్ విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలు కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాలు పునర్నిర్మించాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఏదైనా గ్రామంలో సమస్య వస్తే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగుల ఉమ,వార్డు సభ్యులు జానీ,పెద్దినేని శంత,పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

